సర్వోన్నత న్యాయస్థానం తీర్పిచ్చింది..

పోరాటం ఫలించింది!

- ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షాతిరేకాలు
- సంబురాలు జరుపుకున్న ఎమ్మార్పీఎస్, బీజేపీ, ప్రజాసంఘాలు
- బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, ప్రధాని మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకాలు


అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయోత్సవాలు


ఆంధ్రా కేఫ్ చౌరస్తాలో పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు వినయ్‌కుమార్, సత్యేందర్

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ, ఎమ్మార్పీఎస్, పలు ప్రజా సంఘాలు సంబరాలు నిర్వహించాయి. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రావర్తి జనార్దన్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్‌లోని హరినగర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రాము విగ్రహాలు, ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా మాదిగల హక్కుల కోసం పోరాడుతున్న మంద కృష్ణమాదిగ పోరాటం ఫలించిందన్నారు. ఇందులో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూస రాజు, మద్దూరి శివాజీ, గడ్డం నవీన్, కుషాల్‌కుమార్, జి.వెంకటేష్, ఎర్రోళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...
ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మాజీ కన్వీనర్ తాండ్ర మురళీ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో విజయోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గండి కృష్ణ, గజ్జల సూర్యనారాయణ, విష్ణు, ఎల్లయ్య, మహేష్‌కుమార్, వినయ్, సత్యనారాయణ, గజ్జల రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గత 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాట ఫలితమే ఈ తీర్పు అన్నారు. ఈ తీర్పు మాదిగల భావి తరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కె.మధు, గడ్డం నవీన్, ఆర్.జనార్థన్, నాగేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు

దళితుల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి: వినయ్‌కుమార్
చిక్కడపల్లి: దళితుల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధమైన ఆమోదం తెలపిన సుప్రీంకోర్టుకు అందుకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, వర్గీకరణకు అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారి చిత్రపటాలకు గురువారం ఆంధ్రా కేఫ్ చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సత్యేందర్, ముత్యాలు, రాజేందర్, నవీన్‌కుమార్, నరసింహ, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

మాదిగ సంఘాల విజయోత్సవాలు
కాచిగూడ: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పును ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగాం మాదిగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ, లింగంపల్లి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతో అంతిమంగా మాదిగలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర భీష్మదేవ్, జెర్రిపోతుల పాండురంగా, శేషు కుమార్, మురారి, లక్ష్మణ్, గోవింద్, శ్రీనాథ్, మిట్టు, చోటు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

సుందయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్టీ, ఎస్టీల వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడం పట్ల తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా రంగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ కులాలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి వారి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని మాదిగలు దశాబ్దాలుగా పోరాడారన్నారు. చివరికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ద్వారా సుసాధ్యం చేసుకున్నారని తెలిపారు. మాదిగ దండోరా ఉద్యమం అన్ని కులాల వారికి దిక్సూచిగా నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు, జనాభా దామాషా ప్రకారం 'మేమెంతో మాకంత వాటా'పై పోరాడాలని వారు బీసీలకు పిలుపునిచ్చారు.

మతం మారిన దళితులను బీసీ-సీలోకి మార్చాలి

ఎస్సీ-ఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు మంద సుధాకర్

నల్లకుంట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి (ఎస్సీ-ఆర్‌పీఎస్) నగర అధ్యక్షుడు మంద సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాదిగ, మాల ఉప కులాల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. దళిత జనగణన చేసిన తర్వాతనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. అదే సమయంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులను ముందుగా బీసీ-సీ జాబితాలోకి మార్చాలన్నారు. మాదిగలు, మతం మారిన దళిత క్రైస్తవులను వేరు చేయకుండా ఎస్సీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తే నిజమైన దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళిత ఉపకులాలకు దక్కాలంటే దళిత క్రైస్తవులను వేరు చేసి వారికి బీసీ-సీ సర్టిఫికెట్లు జారీ చేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి



కాచిగూడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులను ప్రభుత్వమే గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది ఉద్యమకారుల పోరాటం, 1969లో 369 మంది, మలిదశలో 1200 మంది అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఇది ఏ ఒక్కరిద్దరి ఫలితంగా తెలంగాణ రాలేదని అన్నారు.

- అసెంబ్లీలో, అసెంబ్లీ బయట బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ఉద్యమం పట్ల అహంకార పూరితంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, అందుకు అన్ని పార్టీల సహకారం లభించిందన్నారు. అస్సాం, జార్ఖండ్, ఛతీస్‌ఘడ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులకు అక్కడి ప్రభుత్వాలు గుర్తింపు కార్డులు ఇచ్చినట్లుగా ఇక్కడ కూడా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందజేయాలని కోరారు.
- ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.30వేల గౌరవ వేతనం (పెన్షన్) ఇవ్వాలని కోరారు. 100 ఎకరాల్లో ఉద్యమకారుల స్మృతి వనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యం, ఉచిత బస్సు పాస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు బి.రంగారెడ్డి, కేసీఎస్ ప్రసాద్, బత్తుల సోమయ్య, జి.చంద్రుడు, అన్వర్‌పటేల్, తుల్జారెడ్డి, సుదర్శన్ యాదవ్, కొండస్వామి, అరుణ, జి.దయానంద్, ఎ.యాదగిరి, డప్పు స్వామి, స్వరూపరాణి, సుజి, డి.అంజయ్య, రాములు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని అభిశ్రయ్ బాయ్స్ హాస్టల్‌లోకి వెళ్లి ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించిన 24 గంటలలో చిక్కడపల్లి పోలీసులు ఛేదించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. హాస్టల్ రూమ్‌లో ఫోన్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టి నిందితుడు పృథ్వీని పట్టుకున్నామని తెలిపారు. అతడి వద్ద సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకోవడంతో ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సై శశిపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సృజన్‌ను ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ అభినందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

నల్లకుంట: ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాపారి అడెపు వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట డైమండ్ టవర్‌లో నివాసముంటున్నారు. గురువారం ఉదయం నిద్రలేచిన వేణుగోపాల్ చూడగా ఇంట్లో కుమార్తె అడెపు అలేఖ(26) కనిపించలేదు. వెంటనే తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన వేణుగోపాల్ గురువారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా డిప్రెషన్‌లో ఉన్న తమ కుమార్తెకు బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..
కాచిగూడ: ఓ తాపీ మేస్త్రీ అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్‌బజార్ కు చెందిన తాపీ మేస్త్రీ అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గురువారం అతని భార్య శ్యామల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి – బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్షీ ప్రేమ్‌చంద్ సేవలు చిరస్మరణీయం

- కవితల ద్వారా కుల వివక్ష నిర్మూలనకు కృషి
- ఓయూ ప్రొ. ప్రదీప్‌కుమార్


ప్రముఖ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి సెమినార్‌లో పాల్గొన్న ప్రొ. ప్రదీప్‌కుమార్

సుందయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలను విస్తృతం చేయడంతో పాటు కుల వివక్షను అరికట్టడానికి మున్షీ ప్రేమ్‌చంద్ చేసిన కృషి చిరస్మరణీయమని ఓయూ ప్రొ. ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో రీసర్చ్ ఫౌండేషన్ ఆఫ్ డివోషనల్ లిటరరీ, కల్చరల్ స్టడీస్ ఆధ్వర్యంలో మున్షీ ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్షీప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొ.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. మున్షీప్రేమ్‌చంద్ సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు తన కథలు, కవితల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. ప్రజలను చైతన్యం చేసే విధంగా రచనలు చేసిన వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని గుర్తు చేశారు. అనంతరం పరిశోధన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. దారేష్మనిజ్యోతి, డాక్టర్ మాధవి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ విప్ బీర్ల ఐలయ్య ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం

బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

నల్లకుంట: ఆలేరు ఎమ్మెల్యే, చీఫ్ విప్ బీర్ల ఐలయ్య అసెంబ్లీలో బ్రాహ్మణ జాతి సంక్షేమం కోసం చేసిన ప్రతిపాదనను యావత్ బ్రాహ్మణ జాతి స్వాగతిస్తోందని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. గురువారం నల్లకుంటలోని టీబీఎస్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రచార కార్యదర్శి మంత్రి సునీల్‌తో కలిసి రమణారావు మాట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో యాదగిరిగుట్టను ధ్వంసం చేస్తూ కోట్లాది రూపాయలు దోచుకుందని ఆరోపించారు. ఈ అనాలోచిత ఆలోచనల కారణంగా గుట్టపైన భక్తులు బస చేందుకు కనీసం వసతి కల్పించలేదన్నారు. ప్రస్తుతం ఉన్న వేయి గదులను వీఐపీలకే కాకుండా సామాన్య భక్తులకూ కేటాయించాలన్నారు. దేవాలయాల అభివృద్ధి పేరిట దోచుకున్న కోట్లాది రూపాయలను అక్రమార్కుల నుంచి రికవరీ చేయాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన ప్రతిపాదన హర్షణీయమని అన్నారు. అన్యాక్రాంతమైన వివిధ దేవాలయాల భూములను తరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి పది జిల్లాల్లో బ్రాహ్మణ భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. పేద బ్రాహ్మణులకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మోదీ పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పింది'

సుందయ్య విజ్ఞాన కేంద్రం: మోదీ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ విమర్శించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన కాలంలోనే విద్యా కాషాయికరణ చేయడమే ఎజెండాగా పని చేసిందన్నారు. అందుకు తగ్గట్లుగానే విద్యా వ్యవస్థలో పలుమార్పులు చేసిందన్నారు.

- స్వాతంత్ర పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఎందరో విప్లవకారుల చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించి మూఢ నమ్మకాలను ప్రేరేపించే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ తమ వ్యక్తిగత వాదమైన మనువాదాన్ని విద్యా కాషాయికరణను అమలు చేసే దిశగా పూనుకుందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు అనేక వాగ్దానాలు చేసి వాటిలో ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

సుందయ్య విజ్ఞాన కేంద్రం: ఆరు గ్యారంటీలతో పాటు రైతు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఎల్.పద్మ మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నేటికి అమలు చేకపోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడం లేదన్నారు.ప్రతి పథకాన్ని రేషన్‌కార్డుతో ముడిపెట్టిన ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత రాకముందే ప్రభుత్వం మేల్కొని వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డి.సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు.

ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను పెంచాలి

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల వద్ద పార్టీ నేతలు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు మహేందర్ మాట్లాడుతూ.. నగరంలో కోటిపైగా ఉన్న జనాభాకు అరకొర బస్సులే ఉన్నాయన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో 7 వేల బస్సుల డిమాండ్ ఉన్నా ప్రస్తుతం 2800 బస్సులు మాత్రమే నడుపుతున్నారని పేర్కొన్నారు. వాటిలో సగానికిపైగా స్క్రాప్‌కు వెళ్లాల్సిన బస్సులే ఉన్నాయని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా ప్రయాణికుల శాతం 40 నుంచి 60 శాతానికి పెరిగిందన్నారు. పాఠశాలలు, కళాశాలలలో సమయాల్లో విద్యార్థులు బస్సుల్లో కిక్కిరిసి ప్రమాదకరమైన పరిస్థితుల్లో వెళ్తున్నాయని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు జి.రాములు, బి.సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


బర్కత్‌పుర బస్టాప్‌లో సంతకాలను సేకరిస్తున్న సీపీఎం నేతలు మహేందర్

రాంనగర్‌లో సంతకాల సేకరణ
ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ మీ సేవా కేంద్రం వద్ద ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఎం.దశరథ్, ఆర్.వెంకటేష్, పి.మహేందర్, కె.రమేష్, పి.విమల, సిరాజ్, శ్రీరాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జేఏసీ డిమాండ్

కవాడిగూడ: తెలంగాణలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్స్)ల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 11 సంవత్సరాలుగా ఎలాంటి బదిలీలు లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ నేతలు పేర్కొన్నారు. వెంటనే వారికి బదిలీలు చేపట్టి న్యాయం చేయాలంటూ గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ శాంతియుత దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ డా. కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. గతంలో రాష్ట్రంలో మోడల్ స్కూల్ ఏర్పాటు విషయంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ప్రత్యేక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. గత 11ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్లలో 3000లకు పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వారికి బదిలీలు కల్పించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. మోడల్స్ స్కూల్స్ టీచర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు అరవింద్ గోష్, వి.గోపీనాథ్, కె.సాయిచరణ్, రాజశ్రీ, ఎండీ ఇర్షద్ అలీ, సాజీద్, శివప్రసాద్, రవీందర్, ఏవీ ప్రసాద్, ఆంజనేయులు, రజనీ, లత తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చౌక్ జరిగిన దీక్షలో మాట్లాడుతున్న డా. కత్తి వెంకటస్వామి

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

కాచిగూడ: గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను కాచిగూడ పోలీసులు ఆరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్‌బజార్‌లో రాజేందర్ అగర్వాల్ (60) ఇంట్లో పేకాట ఆడుతున్న శ్యామ్ సుందర్ (64), ప్రేంకుమార్ (60), బ్రిజ్ గోపో (70), రమేష్ చంద్ (50), దీపక్ అగర్వాల్ (40)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 59,660 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం డివిజన్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కవాడగూడ, అడిక్‌మెట్ డివిజన్లకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రూ.11,61,500 విలువైన చెక్కులను అందజేశామన్నారు.

ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి వైద్యాధికారిగా డా. అలివేలు మంగ

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న చిక్కడపల్లి ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి వైద్యాధికారిగా డాక్టర్ అలివేలు మంగ గురువారం నియామితులయ్యారు. ఈ సందర్భంగా అలివేలు మంగ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు.

కాచిగూడ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. చిరంజీవి

కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ చిరంజీవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై కాచిగూడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత వికారాబాద్ జిల్లా మరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.

ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి

సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై సీఎం వ్యాఖ్యలకు నిరసన

- ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు


ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బైఠాయించిన బీఆర్ఎస్ నేత జైసింహ, నాయకులు


శ్రీరమణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తూ..

చిక్కడపల్లి: బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పార్టీ పిలుపు మేరకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ముఠా జయసింహతో పాటు ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్‌డౌన్, మహిళలకు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసేందుకు యత్నించిన ముఠా జైసింహతో పాటు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముఠా జయసింహ మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, అసెంబ్లీ సాక్షిగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు తెలంగాణలోని ఆడబిడ్డలను కించపరిచేలా ఉన్నాయన్నారు. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం ఉందని, కనీస సోయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావంటూ సీఎం తన స్థాయి మరచి మాట్లాడటం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కుర్చీ భయం ఉందని, ఆయన పదవి కాపాడుకోవడంలో చూపుతున్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై చూపడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, వై.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముఠానరేష్, పాశం రవి, గడ్డమీది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై నిరసనలు
అంబర్‌పేట: అసెంబ్లీలో మహిళ ప్రజా ప్రతినిధుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. గురువారం అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్, మహిళా నాయకురాలు శిరిష ఓంప్రకాశ్ యాదవ్, నాయకులు చందు, శ్రీరాములు ముదిరాజ్, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిల్, రవీందర్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం మహిళలకు క్షమాపణ చెప్పాలి
బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు
సుందయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్ డిమాండ్‌చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నటువంటి అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి మహిళలను అగౌరవపరిచే విధంగా మాట్లాడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వెంటనే యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతామని అన్నారు.


బాగ్‌లింగంపల్లిలో.. బీఆర్‌టీయూ నేతలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383